AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatodaynews.com

19-7-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2



ప్రజారోగ్యంపై పట్టింపేది..!



2



2

మొరాయించిన ఈవీ బస్సు


## పీసీసీ చీఫ్‌ను కలిసిన ఆర్మూర్ నేతలు..



**అక్షరటుడే, ఆర్మూర్:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను ఆర్మూర్ ప్రాంత కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్మూర్‌లో ప్రస్తుత రాజకీయ పరిస్థితులను ఆయనకు తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఏఎంసీ ఛైర్మన్, పట్టణ అధ్యక్షుడు సాయిబాబా గౌడ్, కౌన్సిలర్ నర్మ నవీన్, శాల ప్రసాద్, నాయకులు గిరి, చిట్టి రెడ్డి, సాయినాథ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సారెస్పీ 'బీచ్' భలేగుందోచ్..



శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ కొత్త అందాలను సంతరించుకుంది. అచ్చం సాగర తీరాన్ని తలపిస్తోంది. ప్రాజెక్ట్‌లో నీటి మట్టం తగ్గడంతో ఎన్నడూ లేని విధంగా ఇసుక తిన్నెలతో మురిపిస్తోంది. జలాశయ తీరం బీచ్‌లా కనిపిస్తుండడంతో పర్యాటకులు తరలివస్తున్నారు. 'గోవా వరకు వెళ్లక్కర్లేదు.. ఎస్సారెస్పీ బీచ్‌కు పోదాం' అంటూ యూత్ ఇక్కడకు వచ్చి సందడి చేస్తున్నారు. చిన్నాపెద్దా అంతా కలిసి సాగర్ తీరంలో సేద దీరుతున్నారు. – గొడబోలే భరత్, అక్షరటుడే, బాల్కొండ



## ఆగస్టు 2న నగరంలో ఊర పండుగ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలో ఆగస్ట్ 2న ఊర పండుగను నిర్వహించనున్నట్లు సర్వ సమాజ్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. నగరంలోని సిర్నపల్లి గడిలో ఆదివారం కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఊర పండు గలో భాగంగా జూలై 30న బండారు పోసే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రతి ఏడాదిలాగే అన్ని కులాల ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తామని వివరించారు. సర్వ సమాజ్ కమిటీ కన్వీనర్ రామర్తి గంగాధర్ మాట్లాడుతూ.. కార్యక్రమం ఆసాంతం పక్కాగా జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్వ సమాజ కమిటీ కో కన్వీనర్ ఆదె ప్రవీణ్, కౌడపు శరత్, బంటు బలరాం, సత్యపాల్ తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ..



- పోటాపోటీ సవాళ్లతో ఆర్మూర్‌లో పొలిటికల్ హీట్
- అప్రమత్తమైన పోలీస్‌శాఖ
- పట్టణంలో బీఎన్ఎస్ 163 అమలు
- ఏం జరుగుతుందోనని సర్వత్రా ఉత్కంఠ

**ఆర్మూర్‌లో రాష్ట్ర అధికార కాంగ్రెస్, కేంద్ర అధికార బీజేపీ పార్టీ నాయకుల మధ్య పోటాపోటీ సవాళ్లతో రాజకీయ వేడి రాజుకుంది. ఇచ్చిన వాగ్దానాలు పూర్తి చేయని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ఇల్లు ముట్టడిస్తామని కాంగ్రెస్ పిలుపునివ్వగా.. బీజేపీ సైతం తన బలాన్ని చూపించేందుకు సిద్ధమైంది. దీంతో ఆర్మూర్ నియోజకవర్గంలో టెన్షన్ వాతావరణం నెలకొంది.**

**- అక్షరటుడే, ఆర్మూర్**

సోషల్ మీడియా స్టేటస్‌లలో పోస్టర్ల హోరు.. 'రూపాయికే వైద్యం, సొంత డబ్బులతో గ్రామానికి 10 ఇళ్లు కట్టిస్తానని ఎన్నికల్లో వాగ్దానం చేసిన ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి గెలిచిన తర్వాత ఆర్మూర్ ప్రజలను మోసం చేశాడని ఆర్మూర్ కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. మాట ఇవ్వడం కాదు.. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని.. ఎమ్మెల్యే కళ్లు తెరిపిద్దామని పేర్కొంటూ కాంగ్రెస్ పార్టీ నేతలు సోమవారం 'చలో అంకాపూర్'కు పిలుపునిచ్చారు. దీంతో వారికి దీటుగా 'కామారెడ్డిలో జరిగినట్లు సోమవారం ఆర్మూర్‌లో జరగాలి.. బీజేపీ బలం ఏమిటో చూపిద్దామని పేర్కొంటూ బీజేపీ నాయకులు సిద్ధమయ్యారు. ఈ వ్యాఖ్యలతో ఇరుపార్టీల నాయకులు సోషల్ మీడియాలో స్టేటస్‌లు, పోస్టర్లతో హల్‌చల్ చేస్తున్నారు. సోమవారం 'చలో అంకాపూర్'కు రెండు పార్టీల శ్రేణులు సంసిద్ధమవుతున్నాయి.

### పోటాపోటీగా ప్రెస్‌మీట్లు..సమావేశాలు..

ఈ నేపథ్యంలో ఆర్మూర్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు ఆదివారం టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి ఆర్మూర్‌లో తాజా రాజకీయ పరిస్థితిని వివరించినట్లు సమాచారం. మరోవైపు బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి మాట్లాడుతూ.. కాంగ్రెస్ శ్రేణులు ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తే, బీజేపీ శ్రేణులంతా టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఇంటితోపాటు ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, భూపతి రెడ్డి ఇళ్లను ముట్టడిస్తామని పిలుపునివ్వడం అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. రూ.700 కోట్లతో ఆర్మూర్ నియోజకవర్గంలో ఎలాంటి అవినీతికి తావు లేకుండా ఎమ్మెల్యే అభివృద్ధి చేస్తుంటే కాంగ్రెస్ నేతలు విమర్శలకు దిగడం సిగ్గుచేటని ఆయన పేర్కొన్నారు.

### పోలీస్‌శాఖ అప్రమత్తం..

పోటాపోటీ ప్రకటనల నేపథ్యంలో పోలీస్‌శాఖ అప్రమత్తమైంది. ఆర్మూర్‌లో ఆదివారం నుంచి సోమవారం వరకు బీఎన్ఎస్ 163 సెక్షన్ అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ప్రకటించారు. ధర్నాలు, రాస్తారోకోలకు ఆస్కారం లేదన్నారు. చట్టాన్ని ఎవరు ఉల్లంఘించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ హెచ్చరించారు.

### 'ఎన్నికల హామీలు ఏమయ్యాయి'

'ఎన్నికల సమయంలో ఒక్క రూపాయికే వైద్యం పేరుతో హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలో ఏర్పాటు చేసిన దుకాణం బంద్ అయింది' అని ఆర్మూర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ రెడ్డి విమర్శించారు. ఒక రూపాయికి వైద్యం, ప్రతి గ్రామంలో సొంత ఖర్చుతో 10 ఇళ్లు పేరుతో రాకేశ్ రెడ్డి ఇచ్చిన ఎన్నికల హామీలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల షోరూమ్‌లోని స్కూటీలు ఎత్తుకుపోవాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ అడగాలని మాట్లాడే తప్పుడు మాటలను మానుకోవాలని సూచించారు. ఆర్మూర్ అభివృద్ధికి ఎమ్మెల్యే చేసిందేమీ లేదన్నారు. 'చలో అంకాపూర్'కు కాంగ్రెస్ శ్రేణులు పెద్దఎత్తున తరలివస్తారని.. తాను సైతం హైదరాబాద్ నుంచి ఆర్మూర్‌కు చేరుకున్నట్లు వినయ్ రెడ్డి చెప్పారు.

### 'యుద్ధానికి నా స్థాయి వారితోనే సిద్ధం'

'ఓడిపోవడానికి పుట్టిన వారు, అపజయం తప్ప విజయం ఎరగనివారు తప్పుడు పోస్టర్లతో ఆర్మూర్‌లో రాజకీయ క్రీడకు తెరలేపారు' అని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి మండిపడ్డారు. యుద్ధానికి తన స్థాయి వారితోనే సిద్ధమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఎవరొచ్చినా తాను సిద్ధమని ప్రకటించారు. అంకాపూర్ ముట్టడి ఎందుకని ప్రశ్నించారు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని అంకాపూర్‌కు గౌరవంగా స్వాగతిస్తున్నామని, అంకాపూర్ నాటుకోడి చికెన్‌తో భోజనం చేయిస్తామన్నారు. సోమవారం అంకాపూర్‌లో తాను సిద్ధంగా ఉంటానని, ఆర్మూర్‌లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తే ఎవరినీ విడిచిపెట్టబోమన్నారు. ఆర్మూర్‌లో ఎవరి ఆటలు సాగనివ్వమని, నియోజకవర్గం ప్రశాంతంగా ఉండాలన్నారు.

## త్వరలో నిజామాబాద్‌లో విద్యార్థి ఉద్యమకారుల భారీసభ

**అక్షరటుడే, తెయూ క్యాంపస్:** విద్యార్థి ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చాలనే డిమాండ్‌తో త్వరలో నిజామాబాద్‌లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర అధ్యక్షుడు ఎండల ప్రదీప్ అన్నారు. హైదరాబాద్ ఉస్మానియా వర్సిటీలో ఆదివారం జరిగిన ఉద్యమకారుల సంఘం రాష్ట్ర సమావేశంలో ప్రదీప్ మాట్లాడారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, రూ. 25వేల నుంచి రూ. 50 వేల పెన్షన్ ఇవ్వాలని, గుర్తింపు కార్డులు అందజేయాలన్నారు. విద్యార్థుల అర్హతలను బట్టి ప్రభుత్వం జీవో ద్వారా పర్మినెంట్ ఉద్యోగాలను ఇవ్వాలని, వర్సిటీలో ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి, సాంబశివరావు, శంకర్ నాయక్, వెంకట్, వేల్పుల కుమార్, స్వప్న, వడ్డే ఎల్లన్న, గద్దల అంజిబాబు తదితరులు ఉన్నారు.

## పీసీసీ చీఫ్, ఎమ్మెల్యే ఇళ్లను ముట్టడిస్తాం : దినేష్ కులాచారి

**అక్షరటుడే, ఇందూరు:** ఆర్మూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తే తాము సైతం పీసీసీ చీఫ్, కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడిస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి ప్రకటించారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రాకేష్ రెడ్డి ఇంటికి ఒక్క కాంగ్రెస్ నాయకుడు వెళ్లినా.. వేలమంది బీజేపీ నాయకులు, కార్యకర్తలు పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి రెడ్డి ఇళ్లను ముట్టడించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అవసరమైతే 'ఛలో ఆర్మూర్' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సైతం తాము ప్రణాళిక వేశామన్నారు. అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామని కాంగ్రెస్ నాయకులు పోస్టర్లు రిలీజ్ చేయడం సిగ్గు చేటన్నారు. రూ.200కోట్లతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్' ప్రారంభించి పనులను త్వరగా పూర్తి చేయిస్తున్న ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ఇల్లు ముట్టడిస్తారా అని ప్రశ్నించారు. అలాగే ఆర్మూర్ నియోజకవర్గంలో 92 గ్రామాలకు 3000 ఇళ్ల మంజూరు చేశారన్నారు. రూ.45 కోట్లతో అడ్వాన్స్ టెక్నాలజీని ఆర్మూర్ మున్సిపాలిటీకి ఇచ్చారన్నారు. తెలంగాణ అసెంబ్లీలో గల్ఫ్ కార్మికుల కోసం గొంతు ఎత్తి చనిపోయిన కుటుంబ సభ్యులకు రూ.5లక్షలు ఇప్పించారన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అమృత్ స్కీం కింద రూ.43 కోట్లు మంజూరు చేయించారని పేర్కొన్నారు. సుమారు రూ.700 కోట్ల అభివృద్ధి పనులను ఆర్మూర్ ప్రజల కోసం విడుదల చేయించిన రాకేష్ రెడ్డి రూపాయి కూడా అవినీతి లేకుండా మచ్చలేని నాయకుడిగా ఎదిగారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గద్దె భూమన్న, ప్రధాన కార్యదర్శి పోతంగర్ లక్ష్మీనారాయణ, నాగోళ్ల లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు యాదాల నరేష్, జ్యోతి, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఓంసింగ్, రూరల్ మండల అధ్యక్షుడు ఆనంద్, సంతోష్ పాల్గొన్నారు.



## సహకార బ్యాంకులు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక: టీపీసీసీ చీఫ్

**అక్షరటుడే, ఇందూరు:** సహకార బ్యాంకులు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలుగా నిలుస్తున్నాయని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. నిజామాబాద్ నగరంలో నిర్వహించిన అగ్రసేన్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ వార్షిక సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, నూతన ఏటీఎం సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. 1998లో స్థాపించిన అగ్రసేన్ బ్యాంక్, గత 27 ఏళ్లుగా ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ విజయవంతంగా కొనసాగడం అభినందనీయమన్నారు. హైదరాబాద్‌లో చిన్నగా ప్రారంభమైన ఈ బ్యాంక్, నేడు 10 శాఖలతో విస్తరించి ఆదర్శ సహకార బ్యాంకుగా ఎదిగిందని కొనియాడారు. కార్యక్రమంలో ఛైర్మన్ ప్రమోద్ కుమార్ కేడియా, డైరెక్టర్ సీనియర్ వైస్ ఛైర్మన్ నవీన్ కుమార్ అగర్వాల్, వైస్ ఛైర్మన్ సురేష్ కుమార్ అగర్వాల్, బీవోఎం ఛైర్మన్ నారాయణ్ దత్, డైరెక్టర్లు శ్రీ పవన్ కేడియా, గోపాల్ చంద్ అగర్వాల్, రాజేష్ కుమార్ అగర్వాల్, సీఏ పంకజ్ కుమార్ అగర్వాల్, జనరల్ మేనేజర్ సీవీ రావు పాల్గొన్నారు.






## గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** గ్రామాల సమగ్రాభివృద్ధి, ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి అన్నారు. నిజామాబాద్ రూరల్ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆదివారం ఆయన ప్రొసీడింగ్స్ అందజేశారు. గుండారంలో సబ్ సెంటర్ భవన నిర్మాణానికి రూ.5లక్షలు, రెడ్డి సంఘం భవనం కాం పౌండ్ వాల్‌కు రూ.5లక్షలు నిధులను మంజూరు చేశారు. ఈ మేరకు ఆ గ్రామ రెడ్డి సంఘం ప్రతినిధులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. పార్టీ సీనియర్ నాయకులు బాగారెడ్డి ఉన్నారు. కొత్తపేట్ గ్రామ అభివృద్ధి కోసం స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నిధుల కింద రూ.10 లక్షల విలువైన ప్రొసీడింగ్ పత్రాలను కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ఎల్లయ్య, సర్పంచ్ శ్రీధర్ గౌడ్, గ్రామ పెద్దలకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, నాయకులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు: ధన్‌పాల్

**అక్షరటుడే, ఇందూరు:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మహత్తర పండుగ 'బోనాలు' అని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. నగరంలోని కోటగల్లిలో కట్ట మైసమ్మ ఆలయం, నాందేవ్‌వాడ గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల పండుగలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆషాఢ మాసం తెలంగాణకు ప్రత్యేక మాసం అన్నారు. గ్రామ దేవతలకు పూజిస్తూ.. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడి పశువులు ఆరోగ్యంగా ఉండాలని కొలిచే పండుగ అన్నారు. బోనాలు కేవలం పండుగ మాత్రమే కాదని, ఇది మన పూర్వీకుల సంప్రదాయాన్ని.. గ్రామదేవతల పట్ల ఉన్న విశ్వాసాన్ని తరతరాలకు అందించే ఆధ్యాత్మిక వేడుక అన్నారు. బోనం అంటే అమ్మవారికి సమర్పించే నైవేద్యమని పేర్కొన్నారు. మహిళలు పాలు, బెల్లంతో వండిన అన్నాన్ని.. కొత్త కుండలో పెట్టి, వేపాకులు, పసుపు, కుంకుమలతో అలంకరించి తలపై మోసుకుంటూ అమ్మవారికి సమర్పిస్తారన్నారు. పోతురాజుల నృత్యాలు, ఘటం ఊరేగింపులు, రంగం వంటి సంప్రదాయాలు పండుగకు మరింత వైభవాన్ని తీసుకువస్తాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చింతకాయల రాజేందర్, జ్యోతి మురళి, బంటు ప్రీతి ప్రవీణ్, కోటగల్లి మైసమ్మ ఆలయ ప్రతినిధులు దేవేందర్, గౌడ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



# ప్రజారోగ్యంపై పట్టింపేది..?




**ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం.. పాలకుల మాటలకే పరిమితం అవుతున్నాయి. హామీలు ఇవ్వడం తప్ప క్షేత్రస్థాయిలో పరిస్థితిని అంచనా వేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ కారణంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యసేవలు సరిగ్గా అందడం లేదు. ఫలితంగా తప్పనిస్థితిలో ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.** - అక్షరటుడే, కామారెడ్డి

- వైద్యులు లేక పీహెచ్‌సీలు అస్తవ్యస్తం
- సిబ్బంది కొరతతో అల్లాడుతున్న వైనం
- వైద్యుల కోసం రోగుల పడిగాపులు
- ప్రతిపాదనలకే ఫైళ్లు పరిమితం.. పట్టించుకోని వైద్యశాఖ

జిల్లాలో వైద్యారోగ్య శాఖలో సిబ్బంది కొరత రోజురోజుకూ పెరుగుతోంది. ప్రభుత్వం ఒకవైపు ఆరోగ్య రంగానికి పెద్దపీట వేస్తున్నామని చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, టెక్నీషియన్ల కొరతతో పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆస్పత్రులు అస్తవ్యస్తంగా మారాయి. సరైన సమయానికి చికిత్స అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

### పేరుకే బిచ్కుంద ఆస్పత్రి..

బిచ్కుంద మండల కేంద్రంలో పేరుకు మాత్రమే ప్రభుత్వ ఆస్పత్రి ఉంది. సరైన వైద్య సిబ్బంది లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జ్వరం, దగ్గు వంటి సాధారణ అనారోగ్యాలకు కూడా ఇక్కడ మందులు దొరకడం లేదు. దీంతో చుట్టుపక్కల 20 గ్రామాల ప్రజలు 25 కి.మీ దూరంలోని బాన్సువాడకు వెళ్లి చికిత్స చేయించుకోవాల్సి వస్తోంది. రాత్రిపూట ఎవరికైనా ఒంట్లో బాగోలేకపోతే పరిస్థితి మరీ దయనీయం. పగలు ఒక డాక్టర్ వస్తారు, సాయంత్రం అయ్యేసరికి ఆస్పత్రి తాళం వేసేస్తున్నారు. ఎమర్జెన్సీ అంటే ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లడమే దిక్కు అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాదిలో 15 మాత్రమే డెలివరీ కేసులు జరగడం ఆస్పత్రిలో వైద్య సేవలకు ఉదాహరణగా చెప్పవచ్చు.

### గాంధారి పీహెచ్‌సీలో డెలివరీ తిప్పలు

గాంధారి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిస్థితి అధ్వానంగా మారింది. ఇక్కడ కీలకమైన పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఒక గైనిక్ డాక్టర్ పోస్టు, ఒక జనరల్ డాక్టర్ పోస్టు, ఇద్దరు స్టాఫ్ నర్సుల పోస్టులు ఎప్పటినుంచో భర్తీ కాలేదు. గైనిక్ డాక్టర్ లేకపోవడంతో ప్రసూతి విభాగం పనిచేయడం లేదు. ప్రస్తుతం గాంధారి పీహెచ్‌సీ 30 పడకలతోనే నడుస్తోంది. జనాభా పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని దీనిని 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కానీ ఆ ఫైల్ ఇంకా పెండింగ్‌లోనే ఉంది. ఇక్కడ వ్యాపారాలు జోరుగా సాగుతుండడంతో ప్రజల రాకపోకలు తీవ్రంగా ఉంటాయి. ఈ ప్రాంతాల్లో వైద్యసేవలు అత్యవసరమని తెలిసినప్పటికీ ఆస్పత్రి అభివృద్ధిపై మాత్రం ఎవరూ దృష్టి పెట్టడం లేదు.

### జిల్లా వ్యాప్తంగా శాఖలో సిబ్బంది కొరత

కామారెడ్డి జిల్లాలోని చాలా పీహెచ్‌సీలలో ఇదే పరిస్థితి నెలకొంది. ఒక డాక్టర్‌తో 23 సెక్షన్లు చూడాల్సి వస్తోంది. స్టాఫ్ నర్సులు సరిపడా లేకపోవడంతో రోగులకు సరైన సేవలు అందడం లేదు. ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టు లేకపోవడంతో పరీక్షలు, మందుల కోసం కూడా ప్రైవేట్‌పై ఆధారపడాల్సి వస్తోంది. వైద్యులు లేకపోవడంతో ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగుల సంఖ్య కూడా తగ్గిపోతోంది. పోయినా డాక్టర్ ఉండడు, మందులు ఉండవు. అందుకే నేరుగా ప్రైవేట్‌కు వెళ్తున్నామని బిచ్కుందకు చెందిన ప్రజలు పేర్కొంటున్నారు.

### హోదా సరే.. వైద్యులేరి..?

బిచ్కుందకు మున్సిపాలిటీ హోదా ఇచ్చారు సరే.. కానీ కనీస వైద్య సదుపాయం కల్పించలేదని.. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఖాళీగా ఉన్న వైద్యులు, స్టాఫ్‌నర్సుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రతి పీహెచ్‌సీలో 24 గంటలు డాక్టర్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలో మాతా శిశు మరణాలను తగ్గించాలంటే ముందుగా ప్రాథమిక స్థాయిలోనే బలమైన వైద్య వ్యవస్థ ఉండాలి. కానీ ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే అది కలగానే మిగిలిపోతుందేమోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

### గాంధారి ఆస్పత్రి అప్‌గ్రేడ్ అయ్యేనా..?

ప్రస్తుతం గాంధారి పీహెచ్‌సీ 30 పడకలతోనే నడుస్తోంది. జనాభా పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని దీనిని 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కానీ ఆ ఫైలు ఇంకా పెండింగ్‌లోనే ఉంది. ఈ ప్రాంతంలో వ్యాపారాలు జోరుగా సాగుతుంటాయి. ప్రజల రాకపోకలు కూడా విపరీతంగా ఉంటాయి. అయినా ఆస్పత్రి అభివృద్ధిపై మాత్రం ఎవరూ దృష్టి పెట్టడం లేదు.

### వైద్యుల పోస్టుల భర్తీపై సందిగ్ధత

జిల్లాలోని పలు ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యులు, స్టాఫ్ నర్సుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రతి పీహెచ్‌సీలో 24 గంటలూ డాక్టర్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



## సామాజిక సేవకులకు సన్మానం..

**అక్షరటుడే, ఆర్మూర్ :** రక్ష స్వచ్ఛంద సేవాసంస్థ, ఆర్మూర్ ఆధ్వర్యంలో సామాజికవేత్తలు తులసి పట్వారి, ఖాందేష్ సత్యంలను ఘనంగా సన్మానించారు. స్థానిక జిరాయత్ నగర్‌లో ఉన్న విద్యా హైస్కూల్ ఆవరణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్ ఖాందేశ్ మాట్లాడుతూ.. సామాజిక వేత్త తులసి పట్వారి పర్యవరణంపై ప్రజలను చైతన్యపరుస్తున్నారన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా తులసి పట్వారికి పర్యావరణ మిత్ర బిరుదు అందజేశారన్నారు. అదేవిధంగా మరో సభ్యులు సామాజిక వేత్త, ప్రజా సేవకుడు ఖాందేష్ సత్యం ఇటీవల ఆర్మూర్ పట్టు చేనేత సహకార సంఘం డైరెక్టర్‌గా అత్యధిక మెజారిటీతో గెలవడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో రక్షా స్వచ్ఛంద సేవాసంస్థ ప్రధాన కార్యదర్శి విద్యా ప్రవీణ్ పవార్, ఉపాధ్యక్షులు జిందం నరహరి, ఎస్‌జీ శ్రీకాంత్, కోశాధికారి గోనె శ్రీధర్, మీరా శ్రావణ్ సభ్యులు గోక శరత్, ఖోడే శ్రీనివాస్, బండారి నరేశ్, దీపక్, మహేష్, రాజేష్, సంజీవ్ పాల్గొన్నారు.

## అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోధించేందుకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఈ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ (2), ఇంగ్లీష్, హిందీ, భౌతిక శాస్త్రం, రాజనీతి శాస్త్రం, తెలుగు సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో 55శాతం మార్కులతో పీజీ పాసై ఉండాలని.. ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం సరిపోతుందన్నారు. పీహెచ్‌డీ, నెట్, సెట్, బోధనా అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుంది. ఎంపిక కళాశాల విద్యా కమిషనర్ నిబంధనల ప్రకారం ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు జూలై 21 సాయంత్రం 4 గంటల్లోపు తమ దరఖాస్తులు కళాశాలలో అందజేయాలని పేర్కొన్నారు. ఇంటర్వ్యూలు జూలై 22న ఉదయం 10 గంటలకు కామారెడ్డిలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఉంటాయని వివరించారు.

## 26వ తేదీ వరకు దోస్త్ ప్రత్యేక దశ అడ్మిషన్లకు దరఖాస్తులు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్ల కోసం దోస్తు ప్రత్యేక దశ నోటిఫికేషన్ వెలువడింది. ఈ మేరకు గత మూడు దశల్లో డిగ్రీ కోర్సుల్లో సీటు లభించని విద్యార్థులు ఇప్పుడు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు. గతంలో రిజిస్టర్ చేసుకోని వారు కూడా కొత్తగా నమోదు చేసుకొని ఆప్షన్స్ ఎంపిక చేసుకోవచ్చని తెలిపారు. జూలై 20 నుంచి 26 వరకు రిజిస్ట్రేషన్, సీట్లకేటాయింపు జూలై30న జరుగుతుందన్నారు. ఈ ప్రత్యేక దశలో సీట్లు పొందిన విద్యార్థులు జూలై 31 లేదా ఆగస్టు 1న కళాశాలలో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ఈ అవకాశాన్ని ఎల్లారెడ్డి ప్రాంత విద్యార్థులు వినియోగించుకోవాలని అధికారులు తెలిపారు.

## 22వ డివిజన్‌లో మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ



**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని 22వ డివిజన్ మైనార్టీ మహిళలకు మేయర్ ఉమారాణి, కాంగ్రెస్ మైనార్టీ విభాగం ఇన్‌ఛార్జి షేక్ ఆరిఫ్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. 16 మంది మైనార్టీ మహిళలకు కుట్టుమిషన్లను అందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల కోసం అనేక ప్రతిష్టాత్మక పథకాలను అమలు చేస్తోందని వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి కింద జీరో కరెంట్ బిల్లు, రంజాన్ తోఫా కిట్ వంటి పథకాలను విజయవంతంగా అందిస్తున్నామని పేర్కొన్నారు. అంతేకాకుండా, నిరుపేద మహిళల సొంతింటి కల నెరవేర్చేందుకు రూ. 5 లక్షల ఆర్థిక సహాయంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని కూడా చేపడుతున్నామని వెల్లడించారుకార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అపర్ణ, డివిజన్ ఇన్‌ఛార్జి, స్థానిక నాయకులతో పాటు కాలనీవాసులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## 7న బెంగళూరులో ఓబీసీ జాతీయ మహాసభ



**అక్షరటుడే, ఇందూరు:** బెంగుళూరులో ఈనెల 7న ఓబీసీ జాతీయ మహాసభ జరగనుందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ తెలిపారు. ఈ మేరకు నగరంలోని కేర్ డిగ్రీ కళాశాలలో ఆదివారం సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఆగస్టు 7న మండల్ సిఫార్సులు అమలులోకి వచ్చిన సందర్భంగా 11ఏళ్లుగా జాతీయస్థాయిలో ఓబీసీ మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది బెంగళూరులో నిర్వహిస్తున్న సభకు బీసీలందరూ పెద్దఎత్తున హాజరు కావాలని కోరారు. దేశవ్యాప్తంగా ఉన్న బీసీలంతా రాజకీయ పార్టీలకు అతీతంగా ఏకం కావాలని, వారిని ఏకతాటిపైకి తీసుకురావడమే లక్ష్యంగా వచ్చేనెల 7న బెంగళూరులో కార్యక్రమం జరగనుందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 80 కోట్ల మంది ఓబీసీల డిమాండ్ల పరిష్కారమే ధ్యేయంగా, రాజకీయ అధికారమే లక్ష్యంగా ఈ మహాసభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహాసభకు 29 రాష్ట్రాల నుంచి ఓబీసీ ప్రతినిధులు హాజరవుతున్నారని రాష్ట్ర కార్యదర్శి ఆకుల ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుస్సా ఆంజనేయులు, ఆకుల ప్రసాద్, పోల్కం గంగా కిషన్, దర్శనం దేవేందర్, కరిపె రవీందర్, మాడవేడి వినోద్ కుమార్, శ్రీలత, అపర్ణ, చంద్రమోహన్, రిటైర్డ్ ఎంపీడీవో గౌస్ మొహియుద్దీన్, దారం భూమన్న, గంగాధర్ సురేందర్ మహేష్, సత్యనారాయణ, రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మొరాయించిన ఎలక్ట్రిక్ బస్సు.. ప్రయాణికుల అవస్థలు




**అక్షరటుడే, కామారెడ్డి:** ఇటీవల ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులు తరచూ చెడిపోతున్నాయి. సాంకేతిక సమస్యలతో ఎక్కడపడితే అక్కడ నిలిచిపోతుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా ఆదివారం కామారెడ్డి నుంచి నిజామాబాద్ వెళ్తున్న ఎలక్ట్రిక్ బస్సు టేక్రియాల్ శివారులో మధ్యలోనే ఆగిపోయింది. దాంతో ఆ బస్సులోని ప్రయాణికులు రోడ్డుపై గంటకు పైగా అవస్థలు పడాల్సి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి బస్టాండ్ నుంచి మధ్యాహ్నం బయలుదేరిన ఎలక్ట్రిక్ బస్సు నిజామాబాద్ వెళ్తుండగా జాతీయ రహదారి 44పై టేక్రియాల్ వద్దకు చేరుకుంది. అదే సమ యంలో బస్సులో సాంకేతిక లోపం తలెత్తింది. డ్రైవర్ ఎంత ప్రయత్నించినా ముందుకు కదల్లేదు. దాంతో డ్రైవర్, కండక్టర్ వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. బస్సు రోడ్డు మధ్యలో ఆగడంతో వెనుక నుంచి వస్తున్న వాహనాలు కొంతసేపు ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. బస్సులోని ప్రయాణికులు ఎండలో ఇబ్బంది పడ్డారు. ఆర్టీసీ అధికారులు వెంటనే కామారెడ్డి డిపో నుంచి ప్రత్యామ్నాయ బస్సును పంపించారు. దాదాపు గంట తర్వాత వచ్చిన బస్సులో ప్రయాణికులందరినీ ఎక్కించి నిజామాబాద్ కు పంపించారు.

## ఎల్లారెడ్డిలో కార్డన్ సెర్చ్..135 వాహనాలు సీజ్



**అక్షరటుడే,ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మండల కేంద్రంలో ఆదివారం తెల్లవారుజామున పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఉదయాన్నే ప్రత్యేక బృందాలు తనిఖీలు నిర్వహించడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని ఎర్రమనుకుచ్చ, బీసీ కాలనీల్లో డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక బలగాలు తనిఖీలు నిర్వహించాయి. తెల్లవారుజామున 5 గంటల నుంచి పోలీసులు హడావిడి చేయడంతో ఏం జరిగిందోనని ప్రజలు అయోమయానికి గురయ్యారు. పోలీసులు తనిఖీల్లో భాగంగా ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేని సుమారు 135 బైక్‌లు, 8 ఆటోలు, కార్లు ఇతర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. నిబంధనలు పాటించని వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సరైన పత్రాలు తీసుకొచ్చి వాహనాలను తీసుకెళ్లాలని డీఎస్పీ సూచించారు. చోరీ చేసిన వాహనాలతో కొందరు వ్యక్తులు చట్టవ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి సీఐ రాజిరెడ్డి, సదాశివ నగర్ సీఐ, సబ్ డివిజన్ ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వచ్ఛ భారత్



**అక్షరటుడే, ఆర్మూర్ :** పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో గల లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో ఆదివారం ఆర్మూర్ మహాత్మా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు, పేరుకుపోయిన చెత్త చెదారాన్ని, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి శుభ్రపర్చారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆలయంలో స్వచ్ఛ భారత్ నిర్వహించడం మా అదృష్టమన్నారు. ప్రతి రోజు ఆలయానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ పరిసరాలను శుభ్రం చేశామన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గడ్డం సంజీవ్ రెడ్డి, ఆలయ అర్చకులు చిలుకమర్రి ఆనంద్ బాబు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు సుంకె నిశాంత్, జంగిడి భోజన్న, సుమన్, కుకింగ్ నరేష్, కృషివర్ధన్, బోడమీది ప్రశాంత్, గుర్రం రాకేష్, వినోద్ కుమార్, రాహుల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## బోదేపల్లి పంచాయతీలో డీఎల్‌పీవో విచారణ..




**అక్షరటుడే, బాల్కొండ:** బాల్కొండ మండలం బోదేపల్లి గ్రామ పంచాయతీలో కారోబార్ వ్యవహారంపై శనివారం ఆర్మూర్ డివిజనల్ పంచాయతీ అధికారి (డీఎల్‌పీవో) శివకృష్ణ విచారణ చేపట్టారు. ఇటీవల గ్రామపంచాయతీ కారోబార్‌ను తొలగించాలని జీపీ పాలక వర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేసి జిల్లా పంచాయతీ అధికారికి పంపారు. ఈ నేపథ్యంలో డీఎల్‌పీవో గ్రామాన్ని సందర్శించి విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా కారోబార్ తొలగింపు అంశంపై గ్రామస్తుల అభిప్రాయాలను తెలుసుకొని సంబంధిత వివరాలను సేకరించారు. విచారణ సమయంలో సర్పంచ్ రాజమణి, గ్రామ పంచాయతీ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.